## ప్రశాంతంగా ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రారంభం

### సంగారెడ్డి జిల్లాలో హాజరు శాతం 96.90 నమోదు

**సంగారెడ్డి మున్సిపాలిటీ, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త :** జిల్లాలో నిర్వహించిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా బుధవారం ప్రథమ సంవత్సరం తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృత భాషా పేపర్ల పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా జరిగాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి గోవింద్ రామ్ తెలిపారు. మొత్తం 18,179 మంది విద్యార్థులకు గాను 17,616 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో జనరల్ కోర్సుకు చెందిన 16,438 మంది, వృత్తి (వొకేషనల్) కోర్సుకు చెందిన 1,178 మంది విద్యార్థులు ఉన్నారు. మొత్తం 563 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అందులో జనరల్ కోర్సుకు చెందిన 414 మంది, వృత్తి కోర్సుకు చెందిన 149 మంది విద్యార్థులు ఉన్నారు. మొత్తం హాజరు శాతం 96.90 గా నమోదైంది. ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని ఆయన తెలిపారు. పరీక్షల నిర్వహణను పర్యవేక్షి ంచేందుకు కన్వీనర్/డీఐఈఓ 2 పరీక్ష కేంద్రాలను, డీఈసీ సభ్యులు 11 కేంద్రాలను, హెచ్‌పీసీ సభ్యులు 4 కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్లు 11 కేంద్రాలను, సిట్టింగ్ స్క్వాడ్లు 8 కేంద్రాలను తనిఖీ చేసినట్లు గోవింద్ రామ్ తెలిపారు.



# మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

# వార్త

## ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 25, (ప్రభాతవార్త):** ఇంటర్ పరీక్షలు బుధవారం నుండి ప్రారంభం కావడంతో విద్యార్థులు ఉదయం 8 గంటల వరకు పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. చిన్నశంకరంపేటలో పరీక్ష కేంద్రాన్ని మండల తహసీల్దార్ మాలతి పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు కావాలసిన అన్ని సౌకర్యాలు కల్పించినట్లు ఆమె తెలిపారు. ఆర్ఐ రాజు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



హాల్‌టికెట్ నంబర్‌ను సరిచూసుకుంటున్న విద్యార్థులు



పరీక్ష కేంద్రాన్ని తనకి చేస్తున్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

## ఇంటర్ పరీక్షా కేంద్రాలను సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**సంగారెడ్డి మున్సిపాలిటీ , ఫిబ్రవరి 25, ప్రభాతవార్త :**

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణను పర్యవేక్షించే క్రమంలో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య బుధవారం తొలి రోజు జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, షాహీన్ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షా హాళ్లలో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల పని తీరును, పరీక్షల నిర్వహణ విధానాన్ని పరిశీలించారు. విద్యార్థుల హాజరు వివరాలను ఆరా తీశారు. నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలోనే ప్రశ్నాపత్రాలను తెరిచారా లేదా అన్నది పరిశీలించారు. సీసీటీవీ నిఘా మధ్య ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పరీక్షలు నిర్వహిస్తున్నారా అనే విషయాన్ని పరిశీలించారు. పరీక్షాకేంద్రాల్లో తాగునీటి సదుపాయం, మెడికల్ కిట్‌తో ఏఎన్ఎం అందుబాటులో ఉండటం, టాయిలెట్ వసతులు వంటి మౌలిక సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షలు పూర్తైన వెంటనే ఆన్సర్ షీట్లను తగిన పోలీసు బందోబస్తు మధ్య నిర్దేశిత కేంద్రాలకు సురక్షితంగా తరలించాలని సూచించారు. ఎలాంటి కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పూర్తి పారదర్శకతతో, పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. తనిఖీలో సంబంధిత పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్, అధికారులు పాల్గొన్నారు.

### వంటిమామిడి మార్కెట్‌ను సందర్శించిన సిద్దిపేట సిపి



వంటిమామిడి మార్కెట్‌ను పరిశీలిస్తున్న సిపి రష్మీ పెరుమాళ్

**ములుగు, ఫిబ్రవరి 25 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని వంటిమామిడి మార్కెట్‌ను సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ బుధవారం అకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మార్కెట్ పరిసరాల్లో నెలకొన్న ట్రాఫిక్ సమస్యలు, వాహనాల రాకపోకల క్రమబద్ధీకరణపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం మార్కెట్ కమిటీ ప్రతినిధులు, వర్తకులు, పోలీసు అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మార్కెట్‌కు వచ్చే భారీ వాహనాలు, లారీలు రాజీవ్ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా నిర్ణీత పార్కింగ్ ప్రదేశాలలోనే నిలపాలని ఆదేశించారు. ట్రాఫిక్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు రెవెన్యూ, మార్కెటింగ్, పోలీస్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అక్రమ పార్కింగ్‌లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సామాన్య ప్రజలకు, ప్రయాణీకులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వాహనాల రాకపోకలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని స్థానిక పోలీసులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏసిపి నర్సింలు, గజ్వేల్ రూరల్ సిఐ రవిరాజు, ములుగు ఎస్ఐ రఘుపతి, మార్కెట్ కమిటీ అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

**చిన్నకోడూరు, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త :** చిన్నకోడూరులో ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 195 మంది విద్యార్థులకుగానూ 193 మంది పరీక్షకు హాజరు కాగా ఇద్దరు గైర్హాజర్ అయ్యారని ప్రిన్సిపల్ శ్రీనివాస్ తెలిపారు.

**హుస్నాబాద్‌లో...**

**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త :** పట్టణంలో ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులు సమయానికి హాజరై పరీక్షలు రాశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అధికా రులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా దండి లక్ష్మి కొమురయ్య పరీక్ష కేంద్రాలను సందర్శించి విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేశారు. పరీక్షలు ధైర్యంగా రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

### ఇంటర్ పరీక్షల్లో ఇద్దరు గైర్హాజర్

**బెజ్జంకి, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రారంభమైయ్యాయి. పరీక్షా కేంద్రాన్ని సిట్టింగ్ స్క్వాడ్ సందర్శించి తనిఖీలు నిర్వహించారు. 184 విద్యార్థులకు ఇద్దరు విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్టు పరీక్షల నిర్వహణాధికారి సుమన్ రాజా కల్యాణ్, డీఓ ఎల్లయ్య తెలిపారు.

### గ్రామీణాభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకం

**మంత్రి పొన్నం ప్రభాకర్**

**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త :** సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన పోలు సంపత్‌తోపాటు ఉపసర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడిగా ఎన్నికైన పోతారం ఎస్ గ్రామ ఉపసర్పంచ్ బొమ్మగాని రాజ్‌కుమార్‌లను బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే, రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ క్యాంపు కార్యాలయంలో శాలువాతో సత్కారించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల అమలులో సర్పంచ్‌ల పాత్ర ఎంతో కీలకమన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధి కోసం ఐక్యంగా పని చేయాలని కోరారు. పోలు సంపత్ తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలుపుతూ, కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు, ఉపాధ్యక్షులను సత్కరిస్తున్న మంత్రి

# ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

**10,560 మంది విద్యార్థులకుగాను 10,201 మంది హాజరు.. 359 మంది విద్యార్థులు గైర్హాజర్**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 42 పరీక్ష కేంద్రాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు సెకండ్ లాంగ్వేజ్(తెలుగు, హిందీ ఉర్దూ, సంస్కృతం) పరీక్ష ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 10,560 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 10,201 మంది హాజరు కాగా 359 మంది పరీక్షకు హాజరు కాలేదు. ఒకేషనల్ విద్యార్థులు 2497 మందికిగానూ 2333 మంది హాజరు కాగా 164 మంది హాజరు కాలేదు. జనరల్ విద్యార్థులకు సంబంధించి 8063 మందికి 7868 మంది హాజరుకాగా 195 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద 163 సెక్షన్ అమలు చేశారు. జిల్లా కలెక్టర్ హైమావతి జిల్లా కేంద్రంలోని ప్రగతి ఒకేషనల్, గురుకృప, శ్రీనివాస ఒకేషనల్ కళాశాలల్లో పరీక్ష నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. డీఈసీ, స్క్వాడ్ బృందాలు 28 పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

### పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి**

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రగతి జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలను కలెక్టర్ కె.హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో ఏర్పాటు చేసిన సదుపాయాలు, భద్రతా చర్యలు, సీసీ కెమెరాల పర్యవేక్షణ తదితర అంశాలను ఆమె పరిశీలించారు. ఇంటర్మీడియట్-2026 బోర్డు మార్గదర్శకాల ప్రకారం పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్ష రాసేలా చీఫ్ సూపరింటెండెంట్ తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షల సమయంలో ఎలాంటి మాస్‌కాపీయింగ్ జరగకుండా కఠిన పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్లు నిషేధమని, తనిఖీ చేసిన తరువాతే విద్యార్థులను లోపలికి అనుమతించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రం పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు చేయడంతోపాటు గట్టి బందోబస్తు నిర్వహించాలని పోలీసు అధికారులను ఆదేశించారు.



పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ హైమావతి

పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా కొనసాగేందుకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

### ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణత సాధించాలి...

**సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త :**

నారాయణరావుపేట మండలం లక్ష్మీదేవిపల్లి జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో బుధవారం జిల్లా కలెక్టర్ కె.హైమావతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్నం, గుడ్డు, అలుగడ్డ, వంకాయ టమాటా కూరలను పరిశీలించారు. మెనూ ప్రకారం ఆకుకూర పప్పు ఎందుకు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కామన్ డైట్ మెనూ పాటిస్తూ విద్యార్థుల హాజరు ప్రకారం ప్రతివిద్యార్థికి సరిపోయేలా వండించాలని హెచ్ఎంను అదేశించారు. అనంతరం టెన్త్ విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. మార్చి 14 నుంచి జరగబోయే పరీక్షలకు అత్యంత పకడ్బంధీగా సిద్ధం కావాలన్నారు. టెన్త్ అనేది జీవితానికి ఒక పునాది వంటిదని ప్రతి ఒక్కరూ తరగతిలో ఉత్తీర్ణత సాధించాలని ఆల్ ద బెస్ట్ తెలిపారు. అనంతరం ప్రాంగణంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి మెనూ తప్పనిసరిగా పాటించాలని విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్నారు.

### కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో కలెక్టర్ తనిఖీ

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి**

సిద్దిపేట రూరల్ మండలం రాఘవపూర్ గ్రామంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ హైమావతి బుధవారం సందర్శించి మధ్యాహ్న భోజన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యార్థినులకు అందిస్తున్న అన్నం, గుడ్డు, కూర, ఆలుగడ్డలు, టమాటా కూరలను పరిశీలించిన కలెక్టర్, బిర్యానీ అన్నం నాణ్యత సరిగా లేదని గమనించారు. బిర్యానీలో బిర్యానీ ఆకు లేకుండా ఎలా వండారని వంట సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వంటకాలను నాణ్యతగా, రుచికరంగా తయారు చేయాలని స్పష్టంగా ఆదేశించారు. అనంతరం స్టోర్ రూమ్‌ను తనిఖీచేసి కూరగాయలు, వంట సరుకులను పరిశీలించారు. నాణ్యమైన సరుకులనే వినియోగించాలని, గడువు ముగిసిన పదార్థాలను ఎట్టి పరిస్థితుల్లోనూ వాడకూడదని సూచించారు. స్టాక్ రిజిస్టర్‌ను వెరిఫై చేసిన సందర్భంగా, వంటకు ఉపయోగించిన సరుకులు, రిజిస్టర్‌లో నమోదు చేసిన వివరాలకు పొంతనలేదని గమనించి ఎస్ఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

దీనిపై తక్షణ చర్యలు తీసుకోవాలని డీఈఓకు ఫోన్ ద్వారా ఆదేశించారు. విద్యార్థినుల భోజనం, వసతి విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని, వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని తెలిపారు. విద్యాలయం లో మరుగుదొడ్లు, పరిసర ప్రాంతాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రహరీ గోడపై సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసే దిశ గా చర్యలు చేపట్టాలని ఎస్ఓను ఆదేశించారు.



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న నాయకులు

### గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

**-వంటిమామిడి ఎఎంసి వైస్ చైర్మన్ ప్రభాకర్‌గుప్తా**

**ములుగు, ఫిబ్రవరి 25 (ప్రభాతవార్త):** గ్రామాలలో మెరుగైన మౌళిక వసతులు కల్పించి గ్రామాలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వంటిమామిడి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ప్రభాకర్‌గుప్తా అన్నారు. బుధవారం ములుగు మండలం కొత్తూరు గ్రామంలో సర్పంచ్ సరిత గోవర్ధన్ ఆధ్వర్యంలో హాస్పిటల్ భవనం, 4వ వార్డులో సిసి రోడ్ల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పేదలకు, బడుగు, బలహీన వర్గాలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసిసి రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కడపల నర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణారెడ్డి, వైద్య సిబ్బంది, నాయకులు గోవర్ధన్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### 2న వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు

**బెజ్జంకి, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త :** మార్చి 2న మండలంలోని ఆయా గ్రామాల పంచాయతీ వార్డుసభ్యులకు శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్టు ఎంపీడీఓ ప్రవీణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 2 నుంచి 7 వరకు బేగంపేట, బెజ్జంకి, బెజ్జంకి క్రాసింగ్, చీలాపూర్, చీలాపూర్‌పల్లి, దాచారం, దేవక్కపల్లి, గాగిల్లపూర్, గూడెం, గుగ్గీళ్ల, గుండారం గ్రామాల వార్డు సభ్యులకు 8 నుంచి 13 వరకు మిగిలిన గ్రామాల వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ తెలిపారు.

### చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**నర్సాపూర్ ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** పట్టణంలోని రాయరావు చెరువులో ఒక గుర్తు లేని వ్యక్తి మృతదేహం లభించినట్లు ఎస్సై రంజిత్ కుమార్‌రెడ్డి తెలిపారు. పలువురు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా మృతిచెందిన వ్యక్తి సుమారు 45 సంవత్సరాలు ఉండి 5.2 ఎత్తు కలిగి ఉంటాడని తెలిపారు. మృతదేహం మీద ఎరుపు రంగు చెక్స్ షర్ట్, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని మృతదేహం నీళ్లలో ఉన్నందున చర్మమంతా శరీరమంతా ఉబ్బిపోయి గుర్తుపట్టలేనంతగా ఉందన్నారు. తల వెంట్రుకలు లేకుండా గుండుగా ఉందని ఎవరైనా మృతదేహాన్ని గుర్తిస్తే ఎస్సై రంజిత్‌కుమార్‌రెడ్డి ఫోన్ నెంబర్ 8712657941కుగాని లేదా సీఐ జాన్‌రెడ్డి ఫోన్ నెంబర్ 8712657940 నెంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలని తెలిపారు.

### మద్యం తాగి వాహనాలు నడిపినవారికి జైలుశిక్ష, జరిమానా

**గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 25 (ప్రభాతవార్త):** మద్యం తాగి వాహనాలు నడిపిన ఏడుగురికి రూ.70వేల జరిమానా, ముగ్గురికి ఒక రోజు జైలుశిక్ష విధించడం జరిగిందని ట్రాఫిక్ సిఐ మురళి తెలిపారు. గజ్వేల్‌లోని పలు ప్రాంతాలలో కొన్ని రోజుల క్రితం వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 10 మందిని బుధవారం గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతిగౌడ్ ముందు హాజరుపరచగా విచారణ జరిపి జరిమానా, జైలు శిక్ష విధించడం జరిగిందన్నారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన మరో నలుగురికి రూ.20 వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

### విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

**పాపన్నపేట, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త :** విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని నామపూర్‌లో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు కుటుంబీకుల కథనం ప్రకారం...రామాపురం గ్రామానికి చెందిన గణాధికారి నర్సింలు(49) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా మంగళవారం వ్యవసాయ క్షేత్రంలో పంటకు నీళ్లు పెట్టేందుకు వెళ్లగా విద్యుత్‌షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు కుటుంబీకులు వెల్లడించారు కాగా భార్య బాలమ్మ బంధువుల వివాహ వేడుకలో పాల్గొనేందుకు పిల్లలతో మంగళవారం వెళ్లి తిరిగి ఇంటికి రాగా భర్త ఇంటిలో లేకపోవడానికి గమనించి వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి చూడగా మృతదేయం పడిఉండడాన్నిగమనించి వెంటనే గ్రామస్తుల సహాయంతో పాపన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి పంచనామా నిర్వహించి భార్య బాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడికి ఒక కుమారుడు కుమార్తె ఉన్నారు.



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

### విద్యతో ఉత్తమ భవిష్యత్తు : మెదక్ జిల్లా కలెక్టర్

**పాపన్నపేట, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త :** విద్యతోనే బంగారు భవిష్యత్తు ఉంటుందని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. బుధవారం ఆయన నాగ్సాన్‌పల్లి ఉన్నతపాఠశాలలో జరుగుతున్న టెన్త్ స్పెషల్‌క్లాసులు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ త్వరలో జరగనున్న పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. స్పెషల్ క్లాసుల ద్వారా స్లిప్ టెస్టు నిర్వహిస్తు, పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులకు, కనీసం ఉత్తీర్ణులయ్యేలా తీర్చిదిద్దాలని టీచర్లకు చెప్పారు. కనీస సామర్థ్యాల స్థాయి తెలుసుకునేందుకు, విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. ప్రతి విద్యార్థి జీవితంలో పదో తరగతి, ముఖ్యమైన స్థాయి అని, ఇక్కడి నుండే భవిష్యత్ సోపానాలు నిర్మితమవుతాయని తెలిపారు.

### ఉద్యోగుల హెచ్ఆర్‌ను 13 శాతం పెంచాలి

**జహీరాబాద్ ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ప్రస్తుతం అమలులో ఉన్న 11 శాతం హెచ్ఆర్ఏను 13 శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తూ పిఆర్టియూ నాయకులు బుధవారం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఆర్‌బీ ఈఈ నర్సింలును కలిసి వినతిపత్రం సమర్పించారు. మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల పరిధి చివరి ప్రాంతం నుంచి 8 కిలోమీటర్లలోపు ఉన్న గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులకూ హెచ్ఆర్ఏ వర్తింపజేయాలని, ఇందుకోసం డిస్టెన్స్ సర్టిఫికెట్ జారీచేయాలని వారు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు సంగారెడ్డిజిల్లా అధ్యక్షుడు ఆకుల మాణయ్య, జిల్లా గౌరవ అధ్యక్షుడు డా. తులసిరామ్‌రాథోడ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు డి.శ్రీనివాస్, జహీరాబాద్ టౌన్ అధ్యక్షుడు శ్రీశైలం, జహీరాబాద్ రూరల్ అధ్యక్షుడు బాగయ్య, జహీరాబాద్ టౌన్ ప్రధాన కార్యదర్శి తుకారామ్ చవ్వాణ్, అందోల్ అధ్యక్షులు నరోత్తం కుమార్, చే. జనార్ధన్ గౌడ్, జహీరాబాద్ డీఈ రామకృష్ణ, జహీరాబాద్ ఏఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



హెచ్ఆర్ఏ పెంపుకు కలెక్టర్‌ను కలిసిన పిఆర్‌టియు నాయకులు

# రసీదు కొట్టు.. సొమ్ము పట్టు...

**ఏడుపాయల ఆదాయానికి గ్రామ పంచాయతీ కన్నం.. దేవాదాయ ధర్మాదాయ శాఖ పేరున పంచాయతీ పన్ను వసూలు..**







ఏడుపాయల ఆలయం, పక్కన దేవాదాయ ధర్మాదాయ శాఖ పేరున పంచాయతీ పన్ను వసూలు చేసిన రసీదులు

**పాపన్నపేట, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త :** సొమ్ము ఒకరిది సోకొకరిది అన్న చందంగా ఉంది గ్రామ పంచాయతీ కార్యదర్శి తీరు. గ్రామపంచాయతీ స్థలం కాకున్నా తమ పంచాయతీ పరిధిలో అటవీ భూమి పై తైబజరు పన్ను వసూలుచేసి దేవాదాయ ధర్మాదాయ శాఖకే కన్నం వేశారు. వివరాల్లోకి వెళితే... అతి పెద్దజాతరైన సమ్మక్క సారలమ్మ జాతర కాగా రెండవ అతి పెద్ద జాతర ఏడుపాయల వనదుర్గ భవాని మహా జాతర. అయితే ప్రతి ఏటా మహా శివరాత్రి నుంచి మూడు రోజులపాటు జరిగే జాతరకు రాష్ట్ర ప్రజలే కాకుండా పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుని వెళుతూ ఉంటారు. అయితే భక్తుల సౌకర్యార్థం పలు ప్రాంతాల నుంచి వచ్చి చిరు వ్యాపారులు అటవీ ప్రాంతంతోపాటు దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రాంతాలలో గుడారాలకు ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు నిర్వహిస్తూ ఉంటారు. దీంతో భక్తులకు కావలసిన వస్తువులు, ఆహార పదార్థాలు దొరకడమే కాకుండా చిరు వ్యాపారులకు జీవనోపాధి కల్పిస్తూ వస్తుంది. అయితే మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని నాగ్సాన్‌పల్లి గ్రామ శివారులోనీ చిత్తడివిలో అమ్మవారు వెలవడంతో ఆ గ్రామ పంచాయతీ పరిధిలోకి ఆలయం రావడంతోపాటు భక్తుల తాకిడి పెరుగుతూ ఆలయ ఆదాయం మెరుగు పడుతూ వస్తూ ఏటా సుమారు 10 కోట్ల మేర సమకూరే విధంగా చేరడంతో ఆలయం 6ఏ ఆలయంగా దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు వెలువడటంతో పాటు ఆలయాన్ని అభివృద్ధి పరిచేందుకు ప్రతి ఏట ఉత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం ఒక కోటి నుంచి 2 కోట్లమేర ఎస్‌డిఎఫ్ నిధులు విడుదల చేస్తుంది. అయితే ప్రతి ఏటా జరిగే జాతర మహోత్సవా ల్లో పాల్గొనేందుకు లక్షలాది భక్తులు విచేస్తారని చిరు వ్యాపారులు మూడు రోజులపాటు దుకాణ సముదాయాలను ఏర్పాటు చేసుకొని జీవనోపాధి పొందుతుంటారు. జాతరలో చిరు వ్యాపారులు దేవాదాయ ధర్మాదాయ శాఖ, అటవీ శాఖ స్థలాలలో షామియానాలు ఏర్పాటుచేసుకొని వ్యాపారాలు నిర్వహించుకొని దేవాదాయ ధర్మాదాయ శాఖకు కిరాయి చెల్లిస్తుంటారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ వారు కాకుండా గ్రామ పంచాయతీ కార్యదర్శి అటవీ శాఖ స్థలాలలో వెలసిన దుకాణ సముదాయాలపై తైబజరు పన్ను వసూలు చేసి ఆదాయ వనరులుగా మలుచుకున్నారు. పంచాయతీ నిబంధల ప్రకారం గ్రామ పంచాయతీ గ్రామకంఠం స్థలంతోపాటు గ్రామ పంచాయతీ స్థలాలలో వ్యాపారాలు నిర్వహిస్తే గ్రామ పంచాయతీ తైబజారు పన్ను వసూలు చేయవచ్చనే నిబంధనలు ఉన్నాయి. కానీ ఇక్కడ మాత్రం నిబంధనలను ఉల్లంఘిస్తూ అటవీశాఖ స్థలాలలో వ్యాపారాలు నిర్వహించిన చిరు వ్యాపారుల వద్ద ఇష్టారీతిన తైబజరు పన్ను పేరున ఐదు వందల నుంచి వెయ్యి రూపాయల వరకు లక్షలాది రూపాయలు వసూలు చేయడం విడ్డూరంగా ఉంది.

**దేవస్థానం పేరున రసీదు...**

వసూలు చేసిన సొమ్ములకు దేవస్థానం పేరున రసీదు బుక్స్ అచ్చువేయించి గ్రామ పంచాయతీ కార్యదర్శి సంతకం పెట్టి మరీ చిరు వ్యాపారుల వద్ద తైబజరు పన్ను వసూలు చేయడం కొసమెరుపు. ఏ కార్యాలయంలోనైనా తమకార్యాలయానికి సంబంధించిన పన్ను వసూలు కానీ చెల్లింపులు కానీ వారి కార్యాలయ పేరున పొందుపరిచిన రసీదును వాడతారు. కానీ ఇక్కడ దేవాదాయ ధర్మాదాయ శాఖ పేరున రసీదు బుక్స్ అచ్చువేయించి గ్రామ పంచాయతీకి పన్నును వసూలు చేయడం మూలంగా ఓ శాఖ పేరును వాడుకోవడంతోపాటు వారి పేరుపైన పన్నులు వసూలు చేయడం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నేరంగా పరిగణలోకి వస్తుంది. కానీ ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి వేరే శాఖ స్థలాలలో, వేరే శాఖ పేరును వాడుకుని పన్నుల రూపంలో వసూలు చేయడం నేరంగా పరిగణలోకి వస్తుందని న్యాయనిపుణులు చెబుతున్నారు. ఏదిఏమైనా దేవాదాయ ధర్మాదాయ శాఖకు వచ్చే ఆదాయంపై గ్రామ పంచాయతీ కన్నువేయడం ఏడుపాయల ఆలయ అధ్యాయానికి తీరని లోటుగా చెప్పవచ్చు. కాగా ఈ విషయమై గ్రామపంచాయతీ కార్యదర్శి భానుప్రసాద్‌ను వివరణ కోరగా తమ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు తైబజారు పన్ను వసూలు చేసినట్లు చెప్పడం కొసమెరుపు.

### ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తా: ఈఓ

ఈ విషయమై ఏడుపాయల ఆలయ ఇఓ వీరేశంను వివరణ కోరగా గ్రామ పంచాయతీ కార్యదర్శి తమ శాఖ అనుమతులు లేకుండా తమ శాఖ పేరున పన్ను వసూలు చేయడంపై ఉన్నత స్థాయి అధికారులతోపాటు జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసి వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని వివరించారు.



పాట్నా న్యాయమూర్తికి జ్ఞాపికను అందిస్తున్న దేవాలయ సిబ్బంది

## మల్లికార్జునస్వామిని దర్శించుకున్న పాట్నా హైకోర్టు న్యాయమూర్తి

**కొమురవెల్లి, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని శ్రీమల్లికార్జునస్వామి దేవాలయాన్ని బుధవారం పాట్నా హైకోర్టు న్యాయమూర్తి అనుపమచక్రవర్తి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం స్వామివారి శేషవస్త్రాలు చిత్రపటంతోపాటు ప్రసాదాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో చేర్యాల కోర్టు సూపరింటెండెంట్ సుధాకర్, ఈవో వెంకటేష్, పర్యవేక్షకులు ఎన్.చంద్రశేఖర్, ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, ఉప ప్రధాన అర్చకులు సాంబయ్య, ముఖ్య అర్చకులు ఆంజనేయులు, మనోహర్, అర్చకులు బసవేశ్వర్, జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లో వికలాంగుల సంక్షేమానికి 5 శాతం నిధులు కేటాయించాలి

**సంగారెడ్డి బ్యూరో ఫిబ్రవరి 25, ప్రభాతవార్త :**



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లలో వికలాంగుల సంక్షేమనికి 5 శాతం నిధులు కేటాయించాలని, పెన్షన్ రూ. 6వేలకు పెంచి వెంటనే అమలుచేయాలని ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎంఅడివయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, అడిషనల్ కలెక్టర్ పాండుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అడివయ్య మాట్లాడుతూ, కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వికలాంగుల సంక్షేమనికి 1669.72 కోట్లు కేటాయించిందన్నారు. నిధుల కేటాయింపులో కేంద్ర నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో వికలాంగుల సంక్షేమనికి నిధుల కేటా యింపు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మార్చి 20వ తేదీన ప్రవేశపెట్టే బడ్జెట్లో వికలాంగుల సంక్షేమనికి నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.బస్వరాజుపాటిల్, కొనింటి నర్సిములు మాట్లాడుతూ, జిల్లాలో పరికరాలు పంపిణీ చేయ డంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర కమిటీ సభ్యులు జయలక్ష్మి, పి.మేరీ, జిల్లా ఉపాధ్యక్షులు లలిత, రాంచందర్, వెంకన్న, రాములు, రాజ్‌కుమార్, సహాయ కార్యదర్శులు కృపవరం, కుమ్మరి నర్సిములు, నవీన్‌చారి, శంకర్‌నాయక్, జిల్లా నాయకులు అంజమ్మ,పవన్, మల్లమ్మ, జయమ్మ, జలంధర్ తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో ఆదిశంకరాచార్యుల విగ్రహాల ఏర్పాటు


మాట్లాడుతున్న గిరి మహారాజ్

**సంగారెడ్డి మున్సిపాలిటీ ఫిబ్రవరి 25, ప్రభాతవార్త :** జగద్గురు ఆది శంకరాచార్యుల అద్వైతతత్వాన్ని నేటితరానికి తెలిపేందుకు 108 విగ్రహాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు బర్దిపూర్ ఆశ్రమ పీఠాధిపతి 1008 వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహారాజ్ అన్నారు. సంగారెడ్డిలో మీడియాతో బుధవారం ఆయన మాట్లాడారు. మొదటి విగ్రహాన్ని బర్దిపూర్‌లోని ఆశ్రమంలో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. జగద్గురు ఆది శంకరాచార్యుల గురించి నేటి తరానికి తెలియాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సంగారెడ్డి పట్టణంలో కూడా శంకరాచార్యుల విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆయనతోనే సనాతన ధర్మం నేటికి ఉందని వివరించారు. సమావేశంలో 1008 మహామండలేశ్వర్ సిద్దేశ్వర నందగిరి మహారాజ్, రంజోల్ రాజయ్య స్వామి, స్థానిక ఆశ్రమ అధ్యక్షుడు మడుపతి వీరేశం, కార్యదర్శి బసవేశ్వర్ కోశాధికారి రాజేశ్వర్ పాల్గొన్నారు.

## కాలనీల అభివృద్ధికి సంపూర్ణ సహకారం : ఎమ్మెల్యే


అభివృద్ధి కార్యక్రమాలు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

**పటాన్‌చెరు, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త :** పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని నూతన కాలనీల అభివృద్ధికి ప్రణాళిక ప్రకారం నిధులు మంజూరు చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని నందన్ ప్యారడైజ్‌కాలనీలో చేపట్టనున్న అంతర్గత మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పటాన్‌చెరు డివిజన్ పరిధిలో నూతనంగా ఏర్పాటవుతున్న కాలనీలలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ పరీక్షలు బాగా రాయాలి : ఎస్ఐ

**తొగుట, ఫిబ్రవరి 25,ప్రభాతవార్త :** ఇంటర్మీడియట్ పరీక్షలు బాగా రాసి ఉన్నంత చదువులకు ఎదగాలని ఎస్ఐ రవికాంత్ సూచించారు. మండల పరిధిలోని రాంపూర్ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్ష రాస్తున్న విద్యార్థులతో ఆయన మాట్లాడారు. పరీక్షలు రాసే విద్యార్థులు వాహనంపై త్రిబుల్ రైడింగ్ చేయరాదన్నారు.హెల్మెట్ ధరించి వాహనం నడపాలన్నారు. గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసలు కావద్దొన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ కోర్సు

**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రాథమిక కంప్యూటర్ నైపుణ్యాలపై రెండో విడత ధృవపత్ర కోర్సు త్వరలో ప్రారంభమవుతోందని ప్రిన్సిపాల్ విజయగిరి బిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో ఇంటర్మీడియట్, డిగ్రీ చదువుతున్న లేదా పూర్తిచేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని, కోర్సు వ్యవధి రెండునెలలు ఉంటుందని ఇందుకు ఫీజు రూ. 400 చెల్లించాల్సి ఉంటుందని, విద్యార్థులకు ఉచితంగానే అధ్యయన సామగ్రి, కోర్సు పూర్తయ్యాక ధృవపత్రం అందజేయడం జరుగుతుందని, పూర్తి వివరాలకు 8897402310కు సంప్రదించాలని, దరఖాస్తు చేసుకునేందుకు మార్చి 5 వరకు అవకాశం ఉందన్నారు.

# గ్రామాల్లో 24 గంటలు అందుబాటులో మద్యం

### సిపి మారడంతో సందు సందున మద్యం విక్రయాలు.. పట్టించుకోని అధికారులు



**ములుగు, ఫిబ్రవరి 25 (ప్రభాతవార్త):** సిద్దిపేట జిల్లా సిపిమారడంతో గ్రామాల్లో సందు సందున మద్యం విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి. తెల్లవారుజాము నుంచే బెల్ట్ దుకాణాల నిర్వాహకులు మందుబాబులకు విందులు ఏర్పాటు చేస్తున్నారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన విజయ్‌కుమార్ బదిలీపై వెళ్లిన తర్వాత ములుగు మండలంలోని గ్రామాల్లో ఏ సందులో చూసినా బెల్ట్ షాపుల నిర్వాహకులు విచ్చలవిడిగా మద్యం విక్రయిస్తున్నారు. గోవా రాష్ట్రం తరహాలో లేడీస్ ఎంపోరియం నుంచి మొదలుకొని బేకరీలు, హోటళ్లు, కిరాణా దుకాణాలు అన్నింటిలో మద్యం విక్రయాలు కొనసాగుతున్నట్లు గ్రామస్తులు తెలుపుతున్నారు. సిపిగా విజయ్‌కుమార్ బాధ్యతలు నిర్వహించినప్పుడు బెల్ట్‌షాపులపై ఉక్కుపాదం మోపి ఎంతో మంది జీవితాలకు ఊరట కల్పించారని, ప్రస్తుతం ములుగు మండల పరిధిలోని ఏ గ్రామానికి వెళ్లినా 24 గంటలు మద్యం అందుబాటులో ఉండడం గమనార్హం. అనారోగ్యంతోఉన్న మనుషులకు వారిని బ్రతికించడానికి వైద్యులు రాసిన మందులు దొరికే మెడికల్‌షాపులు 24 గంటలు అందుబాటులో లేకున్నా మనుషుల జీవితం అన్ని విధాలుగా నాశనం చేసే మద్యం మాత్రం ఏటిఎంలో డబ్బుల మాదిరిగా ఎనీ టైమ్ లభ్యమవుతుంది. గ్రామాల్లో బెల్ట్ షాపుల నిర్వహణ వల్ల వయసుతో సంబంధం లేకుండా విచ్చలవిడిగా ప్రజలు మద్యానికి బానిసలై ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్వాకం అధికారులకు తెలిసినా బెల్ట్ షాపుల నిర్వాహకులు ఇస్తున్న మామూళ్లకు అలవాటుపడి చూసీచూడనట్లు వదిలేయడమే కాకుండా కొన్నిచోట్లలో సంబంధిత అధికారులే ఉద్యోగస్తుడనని మరిచి దిగజారి బెల్ట్ షాపుల్లో మద్యం సేవిస్తూ కంటే చేను మేసిందన్నట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు మేలుకొని అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్ట్ షాపుల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకొని పేద కుటుంబాలను ఆదుకోవాలని కోరుతున్నారు.


సుంకర మల్లేశంను సన్మానిస్తున్న బిఎంఎస్ నాయకులు

## బిఎంఎస్ జాతీయ అధ్యక్షుడికి సన్మానం

**గజ్వేల్, ఫిబ్రవరి 25 (ప్రభాతవార్త):** బిఎంఎస్ జాతీయ అధ్యక్షునిగా నూతనంగా ఎన్నికైన సుంకర మల్లేశంను బుధవారం రాణే మద్రాస్ లిమిటెడ్ బిఎంఎస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సల్ల శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.శ్రీశైలం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ బిఎంఎస్ జాతీయ అధ్యక్షునిగా తెలంగాణ రాష్ట్రం నుండి సుంకర మల్లేశం ఎన్నిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం నుంచి జాతీయ అధ్యక్షున్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం కార్మిక లోకం చేసుకున్న పుణ్యమని కొనియాడారు. అలాగే రాష్ట్రం నుండి జాతీయ స్థాయిలో లీగల్‌సెల్ ఇంచార్జ్‌గా బి.రాజిరెడ్డిని ఎంపిక చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిఎంఎస్ నాయకులు ఎస్.కె.నజీర్, కె.పరశురామ్, టి.శ్రీనివాసచారి, ఎం.దేవయ్య, ఎండి.ఇమామొద్దీన్, పి.బాల్‌రెడ్డి, బి.మల్లేశం, ఘసిరామ్, కిషోర్‌బాబు, సూర్యరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

### కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ

**సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 25,ప్రభాతవార్త :** ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని గూడు లేని ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ పథకం కింద ఇల్లు నిర్మించి ఇవ్వడమే కాంగ్రెస్ సర్కార్ ధ్యేయమని సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. నారాయణరావుపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ది పొందిన బిట్ల నర్మదా-యాదగిరి నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో ఆయన బుధవారం పాల్గొని మాట్లాడారు. పేద ప్రజల సొంత ఇంటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ సర్కార్ సిఎం రేవంత్‌రెడ్డి సంకల్పమన్నారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన పేద కుటుంబాలు గౌరవంతో జీవించే అవకాశాన్ని కాంగ్రెస్ సర్కార్ కల్పిస్తుందన్నారు. గూడులేని ప్రతి పేదవాడికి ఇందిరమ్మ పథకంద్వారా ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. పేదల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధియే ధ్యేయంగా ముందుకు సాగుతున్న కాంగ్రెస్ సర్కార్‌కు ప్రతి ఒక్కరూ అండగా నిలువాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజ్‌వీర్, బిట్ల శ్రీనివాస్, బింగి యాదగిరి, మాటిల్లా కనకయ్య, ఉప సర్పంచ్ పర్శరాములు, నాగరాజు, అశోక్, ఎర్ర మహేందర్, చెంది శ్రీనివాస్, మెరుగు రాజు, కృష్ణమూర్తి, అజమాత్, వంశీ, నర్సంలు, బుగ్గ రాజేశ్వర ఆలయ చైర్మన్ కరుణాకర్ భాగన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటి నుంచి గోటి తలంబ్రాలు వెళ్లాలి

### -రామకోటి రామరాజు

**గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** భద్రాచల శ్రీరాముని కళ్యాణంలో ఉపయోగించే గోటి తలంబ్రాలు ప్రతి ఇంటినుండి వెళ్లాలనే ఉద్దేశంతో గోటి తలంబ్రాల దీక్షచేపట్టడం జరిగిందని శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు, భక్తిరత్న జాతీయ అవార్డుగ్రహీత రామకోటి రామరాజు తెలిపారు. భద్రాచల దేవస్థానంనుండి వచ్చిన వడ్లను ప్రతి ఇంటికి అందజేసి గోటితో ఒలిపించి వాటిని తిరిగి భద్రాచల దేవస్థానానికి అందించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా బుధవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కౌన్సిలర్ రొట్టెల శ్రీనివాస్ దంపతులకు వడ్లను అందజేయగా,వాటిని ఒలిచి, తలంబ్రాలుగా మార్చి, అందజేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ గోటి తలంబ్రాల కార్యక్రమంలో పాల్గొ నాలని రామకోటి రామరాజు తెలిపారు.

## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం చేసిన సర్పంచులు

**నర్సాపూర్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:** ప్రభుత్వం నుంచి మంజూరైన ఇందిరమ్మ ఇళ్ళు పూర్తికాగా, ఆ ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల్లో నత్నాయపల్లి గ్రామసర్పంచి ఉదయ్‌కుమార్, కాగజ్ మద్దూర్ గ్రామసర్పంచి విజయశివకుమార్‌లు పాల్గొని గృహప్రవేశాలు చేయించారు. ఈ మేరకు నర్సాపూర్ మండలంలోని నత్నాయపల్లి గ్రామ పరిధిలోని నైమాతుల్లగూడెం గ్రామానికిచెందిన బోయిని వీరమని నర్సిం లు ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకొని గృహప్రవేశం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచి ఉదయ్‌కుమార్, అలాగే మద్దూర్‌సర్పంచి విజయశివకుమార్ నత్నాయపల్లి ఉపసర్పంచి ఎల్లయ్య, వార్డుసభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గాడిపల్లి భాస్కర్

## రఘునందన్‌రావుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం

### -మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్

**గజ్వేల్, ఫిబ్రవరి 25 (ప్రభాతవార్త):** ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయాలకు అతీతంగా ఒక్కో స్థానంలో ఒక్కో పార్టీ మద్దతు ఇచ్చి చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు పంచుకున్నారని, అందులో భాగంగానే బిజెపి రాష్ట్ర శాఖ నిర్ణయానికి కట్టుబడి ఉండి మెదక్ ఎంపి మాధవనేని రఘునందన్‌రావు బిఆర్‌ఎస్ పార్టీకి చెందిన బిసి బిడ్డకు మద్దతు ఇచ్చారని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, 4వ వార్డు కౌన్సిలర్ రొట్టెల శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ రాజకీయ అవకాశవాది నీలం మధుముదిరాజ్ అని, గతంలో జరిగిన ఎంపి ఎన్నికల్లో ఓడిపోయాననే అక్కసుతో మెదక్ ఎంపి రఘునందన్‌రావుపై విమర్శలు చేస్తున్నారని అన్నారు. నీలం మధు 10 సంవత్సరాలు బిఆర్‌ఎస్ పార్టీలో ఉండి పదవులు, ఆస్తులు, డబ్బులు అనుభవించి అధికారం పోయాక కాంగ్రెస్‌గూటికి చేరాడని అన్నారు. బిసి బిడ్డలకు ఎంపి రఘునందన్‌రావు మద్దతు ఇస్తే తప్పు ఏముందని ప్రశ్నించారు. ఎంపి రఘునందన్‌రావు నిజాయతీపరుడని, బిఆర్‌ఎస్ నుండి సస్పెండ్ చేస్తే బిజెపిలో చేరి మూడుసార్లు ఓడిపోయినా పార్టీ మారకుండా ప్రజల్లోఉండి ఎమ్మెల్యేగా, ఎంపిగా గెలిచిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. నీలం మధు ఎంపి రఘునందన్‌రావుపై లేనిపోని విమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు మామిండ్ల నాగు, మాజీ కౌన్సిలర్ రొట్టెల దాస్, కదుల్ల ఎల్లేశం, సాయి, శ్రీరాం కృష్ణ, ప్రసాద్, దేవేందర్, మధు, టోని తదితరులు పాల్గొన్నారు.

## త్రిశక్తి దేవాలయంలో పూజలు నిర్వహించిన కౌన్సిలర్

**గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** ప్రజ్ఞాపూర్‌లోని త్రిశక్తి దేవాలయంలో జరుగుతున్న ప్రథమ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం 14వ వార్డు కౌన్సిలర్ గుంటుకు లక్ష్మీశ్రీనివాస్ ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. అనంతరం కౌన్సిలర్ లక్ష్మీశ్రీనివాస్‌ను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలను అందజేశారు.

## రైతులకు ఎకరాకు రూ.40 లక్షల నష్టపరిహారం: ఆర్డీవో

**నర్సాపూర్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** నర్సాపూర్ నియోజకవర్గంలో రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు 40లక్షల రూపాయలు పరిహారం చెల్లించ బడుతుందని నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం నర్సాపూర్ పట్టణంలోని రైతువేదికలో నర్సాపూర్ డివిజన్‌లోని శివంపేట మండలం లింగోజిగూడ కొత్తపేట రత్నాపూర్ కొంతన్‌పల్లి పాంబండ పోతుల బొగుడ గ్రామాలకు చెందిన రైతుల భూములు 61ఎకరాల 38గుంటల భూమిని సేకరించేందుకుగాను మూడో విడత అవా ర్డు విచారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఈ అవార్డు విచారణ కార్యక్రమంలో పట్టాదారు లకు, అనుభవదారులకు ఈ ప్రాజెక్టు ఉద్దేశం ద్వారా ఒక ఎకరం ధర 13లక్షల 50వేలుగా నిర్ణ యించబడిందన్నారు. ఈ త్రిబుల్‌ఆర్ రోడ్డు నిర్మా ణంలో భూములు కోల్పోతున్న రైతులకు ప్రాజెక్టు నిర్ణయించిన ధర కంటే మూడు రెట్లు అదనంగా 40లక్షలనుండి 50లక్షలవరకు ఒక ఎకరం భూమికి ఈధరను చెల్లించడం జరుగుతుందని తెలిపారు. ఈమేరకు భూనిర్వాసిత రైతుల సందేహాలను తీర్చడం జరిగిందని తెలిపారు. అంతేగాక ఇంకా ఏ రైతులకన్నా అభ్యంతరాలు ఉన్నచో దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో మహిపాల్‌రెడ్డితో పాటు శివంపేట మండల తహ సీల్దార్ కమలాద్రి. రైతురక్షణ సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మిర్యాల చంద్రశేఖర్‌గుప్త, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్డీవో మహిపాల్‌రెడ్డి తదితరులు


మాట్లాడుతున్న తూంకుంట నర్సారెడ్డి

## పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

### మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి

**వర్గల్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. బుధవారం వర్గల్‌లో ఇందిరమ్మ నూతన గృహప్రవేశాలు చేయించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గజ్వేల్ నియోజకవర్గంలో 3వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరుకాగా, అర్హులైన ప్రతిఒక్కరికి ఇళ్లు కేటాయిస్తామని స్పష్టంచేశారు. కొత్తరేషన్ కార్డుల మంజూరుతో పాటు పాత కార్డులలో సభ్యులను చేర్చి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ విజయమోహన్, వైస్‌చైర్మన్ ప్రభాకర్‌గుప్తా, ఉప సర్పంచి గోవర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచి గోపాల్‌రెడ్డి, పంచాయతీరాజ్ సంఘటన్ జిల్లా అధ్యక్షుడు కడవల నర్సింహారెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, నాయకులు కిష్టయ్యగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్‌గౌడ్, అరవింద్‌రెడ్డి, మహేందర్‌గౌడ్, వహీద్, యాదయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

## సరస్వతీదేవి విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన

**చిన్నకోడూరు, ఫిబ్రవరి 25,ప్రభాతవార్త :** జ్ఞానం-సేవ-సమాజాభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుదామని యువ నాయకులు వంగ రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కస్తూరుపల్లి గ్రామంలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో సరస్వతి విగ్రహ ఏర్పాటు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యకు ప్రతీకగా భావించే సరస్వతి అమ్మవారి విగ్రహ నిర్మాణం విద్యార్థుల్లో జ్ఞానాశక్తిని పెంపొందిస్తుందన్నారు. విగ్రహ ఏర్పాటుకు రూ.20 వేల విరాళంగా అందజేసినట్లు తెలి పారు. కార్యక్రమంలో సర్పంచ్ తాళ్లపల్లి స్వామి, ఉప సర్పంచ్ జి.స్వామి, హెచ్ఎం రవీందర్‌రెడ్డి, గ్రామ యువకులు పడిగె లింగం, వార్డు సభ్యులు కందుకూరు సంతోష్,చరణ్, సంతోష్, మనోజ్‌గౌడ్, మహేందర్ రెడ్డి, నరేందర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి, విద్యా ప్రోత్సా హం పట్ల వంగ రాజేశ్వర్‌రెడ్డి కృషని గ్రామస్తులు అభినందించారు.

## మూడు బోరు మోటార్ల అపహరణ .. ఆవేదనలో రైతులు

**బెజ్జంకి, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త :** మండల పరిధిలోని గాగీళ్లపూర్ గ్రామ శివారులోని మోయతుమ్మెద వాగు పరివాహక ప్రాంతంలో సుమారు 3 మోటార్లు అపహరణకు గురైనట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మోటర్ల అపహరణపై బుధవారం పలువురు రైతులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇసుక అక్రమ రవాణ సాగుతున్న సమయంలోనే మోటార్లు అపహరణకు గురవుతున్నాయని.. ఇప్పటివరకు సుమారు 10 మోటార్లు అపహరణకు గురయ్యాయని రైతులు తెలిపారు. మోటార్లు అపహరణకు గురైన తీరుపై సంబధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపి న్యాయం చేయాలని పలువురు రైతులు విజ్ఞప్తి చేశారు.

## సిద్దిపేట మున్సిపల్‌లో రాజ్యమేలుతున్న అవినీతి

### సామాజిక కార్యకర్త గాధగోని చక్రధర్ గౌడ్

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి**

సిద్దిపేట మున్సిపల్ అవినీతి రాజ్యం ఏలుతుందని సామాజిక కార్యకర్త గాధగోని చక్రధర్‌గౌడ్ అన్నారు. తెలంగాణ జాతీయ వజ్రోత్సవాల సందర్భంగా నిధుల గోల్‌మాల్ విషయమై మున్సిపల్ చైర్‌పర్సన్ కడవెరుగు మంజుల రాజనర్సు పై చర్యలు తీసుకోవాలని, అవినీతిపైన ఏసీబీ విచారణ జరపాలని కోరుతూ సిద్దిపేట కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట మున్సిపాలిటీలో అవినీతి రాజ్యం ఏలుతుంది అని మండిపడ్డారు. తెలంగాణ జాతీయ వజ్రోత్సవ వేడుకల సందర్భంగా 7.5 లక్షల రూపాయల గోల్‌మాల్‌పై ఏసీబీ విచారణ జరిగి మూడు నెలలు గడుస్తున్నా నేటికీ చర్యలు లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తుందని చక్రధర్‌గౌడ్ చెప్పారు. మున్సిపల్ బాక్స్ టెండర్ల పేరిట మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ప్రజాధనాన్ని దారి మళ్లించి జేబులు నింపుకుంటునారు అని ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు మున్సిపల్ అవినీతిపైన మౌనం వహించడం శోచనీయమని అన్నారు. మున్సిపల్ అవినీతిలో భాగస్వామ్యు లైన అధికారులు రాజకీయ నాయకులపైన రాజీలేని పోరాటం చేస్తా అని చక్రధర్‌గౌడ్ స్పష్టం చేశారు.

## సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

### మున్సిపల్ కమిషనర్‌ని కలిసిన వినతిపత్రం అందజేసిన సింధుఆదర్శ్ రెడ్డి

**రామచంద్రాపురం, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త :** భారతినగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వెన్నవరం సింధుఆదర్శ్‌రెడ్డి బుధవారం సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ శ్రీజనని మర్యాదపూర్వకంగా కలిసి పలు ప్రజా సమస్యలపై వినతిపత్రం అందజేశారు. బొంబాయి కాలనీ రైతుబజార్ టెండర్ కమ్ ఓపెన్ ఆక్షన్‌లో పాల్గొన్న సింగిల్‌బిడ్ షాపుల కేటాయింపుపై చర్చించారు.టెండర్ ప్రక్రియలో సింగిల్‌బిడ్ షాపులు కేటాయించబడవని ముందుగా స్పష్టంగా తెలియజేయలేదని, ముఖ్యంగా మహిళలు పెద్దఎత్తున దరఖాస్తు చేసుకుని నిరాశకు గురయ్యారని వివరించారు. అందువల్ల సింగిల్‌బిడ్ షాపులను వచ్చిన వారికి కేటాయించాలని కోరారు. అదేవిధంగా టెండర్‌లో పొందుపరచని 22 షాపులకు తక్కువ ధర నిర్ణయిస్తే, ఆ షాపులను మహిళా స్వయం సహాయక సంఘాలు, ఆర్థికంగా బలహీన మహిళలకు కేటాయిస్తామని తెలిపారు. స్టాండింగ్ కమిటీ ఆమోదించిన మిగతా 33 షాపులకు త్వరగా టెండర్ నిర్వహించాలని కోరారు. బొంబాయి కాలనీ కమ్యూనిటీ హాల్‌కు బొంబాయి కాలనీ మరియు ఫెన్సింగ్ ఏరియా కాలనీలు సమీపంలో ఉండటంతో స్థానిక ప్రజలకు అనుకూలంగా ఉండేలా ధర నిర్ణయించాల్సిందిగా సూచించారు. ఇటీవల కమిషనర్ ఆర్.వి.కర్ణన్ ఆమోదించిన ఎంఎంటీఎస్ నుండి అన్నమయ్య ఎన్‌క్లేవ్ వరకు బీటీ రోడ్డు పనులను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా అమీన్‌పూర్ సర్కిల్ కార్యాలయాన్ని రామచంద్రాపురం సర్కిల్ పరిధిలోని ఎంఫీడీవో కార్యాలయానికి మార్పిడి చేయాలని కోరారు. ఈ విషయమై రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తోంట అంజయ్యతో కలిసి కమిషనర్‌కి ప్రత్యేకంగా వినతిపత్రం అందజేశారు. కమిషనర్ శ్రీజన సమస్యలను సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగిందని మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి పేర్కొన్నారు.

## కళ్లేపల్లిలో ఉచిత కంటి వైద్య శిబిరం

**బెజ్జంకి, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త :** మండల పరిధిలోని కళ్లేపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో వాసన్ ఐ కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. సర్పంచ్ బిగుల్ల మోహన్ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.నిపుణులు గ్రామస్తులకు కంటి పరీక్షలు నిర్వహించి తగు సూచనలు చేశారు.వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## శ్రీక్షత్రియ రామజోగి విద్యార్థులకు

### ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ జారీ చేయాలి : కొంగల రాంప్రసాద్

**గజ్వేల్, ఫిబ్రవరి 25 (ప్రభాతవార్త):** శ్రీక్షత్రియ రామజోగి కుల విద్యార్థులకు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్స్ జారీచేయాలని శ్రీక్షత్రియ రామజోగి అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కొంగల రాంప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ జారీ కొరకు ప్రజావాణిలో జాయింట్ కలెక్టర్ అబ్దుల్ అహ్మద్‌కు వినతిపత్రం అందించినట్లు తెలిపారు. ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్స్ కొరకు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా రెవెన్యూ అధికారులు సర్టిఫికెట్స్ జారీ చేయడంలేదని, ఈ విషయంపై ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లినా ఫలితంలేదన్నారు. ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ గురించి రెండు నెలల నుండి విద్యార్థులు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, వెంటనే క్షత్రియ రామజోగి విద్యార్థులకు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్స్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుజ్జేటి వెంకటేశం, రమేష్, శాబోలు నాగరాజు, గుజ్జేటి వసంత, శారద, ప్రమీల, శాబోలు జయమ్మ, వనజ, సత్య, నిత్య, లక్ష్మి, రేణుక పాల్గొన్నారు.

## పాఠశాలకు ఫ్యాన్లు విరాళం

**అక్కన్నపేట, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త :** అక్కన్నపేట మండలం కట్కూర్ గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలకు పూర్వవిద్యార్థులు సహాయం అందించారు. పాఠశాలలో చదువుకున్న 1994-95 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు బుధవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని ఫ్యాన్లను విరాళంగా అందజేసినట్లు సర్పంచ్ కొండముంజ బాలరాజు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ బాలరాజు వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రంగనాయక్, హెచ్ఎం కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా త్రిశక్తి ఆలయం ప్రథమ వార్షికోత్సవం

**గజ్వేల్, ఫిబ్రవరి 25 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని త్రిశక్తి ఆలయంలో ప్రథమ వార్షికోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో జరిగిన విశేష పూజా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, సిఐ రవికుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, 4వ వార్డు కౌన్సిలర్ రొట్టెల శ్రీనివాస్, కొండపోచమ్మ డైరెక్టర్ గుండు లక్ష్మణ్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ఎండి.షరీఫ్, వీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఊడెం సారిక శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి రాజలింగం, మామిడి సురేష్‌గౌడ్, కుర్రె కరుణాకర్‌రెడ్డి, కదుళ్ల రామరాజు, గోపిశెట్టి అశోక్ కుమార్, ప్రొద్దుటూరి వేణులు పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా త్రిశక్తి దేవాలయ కమిటీ అధ్యక్షుడు కదుల్ల ఎల్లేశం, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కాటు జయరాములు తూంకుంట నర్సారెడ్డిని శాలువాతో సన్మానించారు.

**ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో అమ్మవార్లకు బోనాలు**

రెండు రోజులుగా త్రిశక్తి ఆలయంలో జరుగుతున్న ప్రథమ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో అమ్మవార్లకు మహిళలు బోనాలు సమర్పించారు. మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం వరకు పలు వీధుల గుండా ఊరేగింపుగా అమ్మవారికి బోనాలు సమర్పించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.


బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

## జగ్గంపేటలో ఘనంగా స్వయంపాలన



స్వయంపాలన జరుపుకుంటున్న విద్యార్థులు

**చిలిపిచెడ్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:**
మండలం పరిధిలోని జగ్గంపేట గ్రామంలోగల నవభారతి పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులలో ప్రధానోపాధ్యాయులుగా సిద్ధార్థ, కలెక్టర్‌గా రాఘవేంద్ర, డిఈవోగా రుత్విక్‌గౌడ్, ఎంఈఓగా ఫాజిల్, ఉపాధ్యాయులుగా హర్షవర్ధన్, సాత్విక్, సహస్ర, గీత, సాహితి, భాను, ఎం.హర్షవర్ధన్, ప్రసాద్, విగ్నేశ్వర్‌గౌడ్, శ్రీవర్ధన్, ప్రణయ్, ఓంకారేశ్వర్, వరుణ్‌తేజ్‌లు వ్యవహరించినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీకాంత్ గౌడ్ తెలియజేశారు. కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు మహేష్, నిరంజన్, దేవి, గంగవేణి, శిరీష, షరీఫా, సరోజ, భవాని, శిరీష, భువనేశ్వరి, లావణ్య, నాగరాణి, భవాని టీచర్లు పర్యవేక్షించారు.

## ప్రజలపక్షాన నిలిచే పార్టీ కాంగ్రెస్
**-13వ వార్డు కౌన్సిలర్ యువనేత మూడుచింతల నరేందర్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

**గుమ్మడిదల, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
ప్రజలకు ఎల్లవేళలా అండగా నిలిచేది ఒక్క కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని, పేదల జీవితాల్లో నిజమైన మార్పు తీసుకొచ్చే శక్తి కాంగ్రెస్‌కే ఉందని 13వ వార్డు కౌన్సిలర్, కాంగ్రెస్ యువనేత మూడుచింతల నరేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్నివర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ సిద్ధాంతమని అన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ జెండాను ఎగరవేసే బాధ్యతను భుజాలపై వేసుకున్నానని నరేందర్‌రెడ్డి ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమంలో పటాన్‌చెరు ఆత్మకమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు జైపాల్‌రెడ్డి, గోకర నిర్మల, వరలక్ష్మి, అన్నారం మాజీ సర్పంచి జయశంకర్‌గౌడ్, కృష్ణ, వేణుగోపాల్‌గౌడ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు



ఇందిరమ్మ ఇళ్ల మంజూరుపత్రాలను లబ్దిదారులకు అందచేస్తున్న దృశ్యం

**జోగిపేట, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
జోగిపేట పట్టణంలో 12వవార్డులో అర్హులైన లబ్దిదారులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయని, ఈమేరకు మంజూరుపత్రాలను లబ్దిదారులకు గురువారం కౌన్సిలర్ కొరబోయిన సరస్వతీ, మాజీ కౌన్సిలర్ కొరబోయిన నాగరాజులు అందచేశారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారసమయంలో కొంతమంది తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరుకాలేవని మంత్రి దామోదర్ రాజనర్సింహ దృష్టికి తీసుకురాగా, ఎన్నికల అనంతరం అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరుచేస్తామని తెలిపారు. ఈమేరకు అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరుచేయటంతో, మంజూరు పత్రాలను లబ్దిదారులకు అందచేశారు. ఈసందర్భంగా వారి వెంట వార్డు ఆఫీసర్ వర్షిణి ఉన్నారు.

## ఎఐ టెక్నాలజీ నైపుణ్యాలకు దోహదపడుతుంది
**-జెఎన్‌టియు వైస్ చాన్సిలర్ ప్రొఫెసర్ డాక్టర్ టి.కిషన్‌కుమార్‌రెడ్డి**



జాతీయస్థాయి బగ్గీల వాహనాలను పరిశీలిస్తున్న ప్రతినిధులు

**నర్సాపూర్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
ప్రస్తుతం ప్రపంచంలో అతివేగంగా అభివృద్ధిచెందుతున్న ఎఐ టెక్నాలజీల ప్రభావంతో వేగంగా మారుతున్న ప్రకృతిదృశ్యంలో విద్యార్థులు ఆచరణాత్మక అనుభవం పొందడం వంటి ప్రాముఖ్యతలను ఆయన విద్యార్థులకు సూచించారు. బాజావంటి కార్యక్రమాలు విద్యార్థుల విశ్వాసాన్ని పెంపొందించడం వివిధ కంపెనీలు కోరుకునే విద్యార్థుల నైపుణ్యాల అభివృద్ధికి గణనీయంగా దోహదపడతాయని జెఎన్టియు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ టి.కిషన్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం నర్సాపూర్ పట్టణ సమీపంలోని బివిరాజ్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న బాజా సే ఇండియా 2026 మెకానికల్ బగ్గీల పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీ ప్రసాద్, ప్రిన్సిపాల్ సంజయ్‌దూబే డిజిఎం కాంతారావు, మేనేజర్ బాపి రాజు, ఎవో సురేష్, డాక్టర్ వి.మురళీకృష్ణ, మనోనిత్‌సింగ్, శ్రావణ్ కుమార్, అరుణ్‌జౌరా, లలిత్‌పాత్ర, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లపై అవగాహన



అవగాహన సమావేశంలోమాట్లాడుతున్న రిసోర్స్ పర్సన్ తదితరులు

**నర్సాపూర్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
నర్సాపూర్ పట్టణంలోని మండల సమైక్య కార్యాలయంలో మంగళవారం ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ప్రాసెసింగ్ సంస్థల అధికరణ పథకంపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో నర్సాపూర్ చిలిపిచెడ్, శివంపేట్, వెల్దుర్తి మండలాల ఎటిఎంలు, సిసిలు, వివోఎలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఈక్రిశాట్ యాంకర్ పర్సన్ అమర్‌సింగ్ యూనిట్లపై అవగాహన కల్పించారు. అంతేగాక అర్హతగల లబ్దిదారులను గుర్తించి రిజిస్ట్రేషన్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఎపిఎం సంగమేశ్వర్, చిల్పాడు ఎపిఎం గౌరీ శంకర్, వెల్దుర్తి ఎటిఎం సుభాష్‌గౌడ్, శివంపేట ఎపిఎం పెంటాగౌడ్ కౌడిపల్లి ఎపిఎం సంగీత,, ఆయా మండలాల సిసిలు వివోఎలు పాల్గొన్నారు.

# పరిశుభ్రతకు నోచుకోని పల్లెలు
**-పాలకుల నిర్లక్ష్యానికి బలవుతున్న గ్రామజనం**



రోడ్డుకు ఇరువైపులా చెత్తతో నిండిన ప్రాంతం

**కొండాపూర్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
గ్రామాల అభివృద్ధి, పరిశుభ్రతపై గొప్ప గొప్ప హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారు కొత్త పాలకులు. కానీ వాస్తవ పరిస్థితి చూస్తే పల్లెలు మాత్రం ఇప్పటికీ అపరిశుభ్రత గుప్పిట్లోనే మగ్గుతున్నాయి. మండల పరిధిలోని మేజర్ గ్రామమైన మల్కాపూర్ నుంచి మల్లేపల్లి వెళ్లే మెయిన్ రోడ్‌కు ఇరువైపులా పేరుకుపోయిన చెత్త కుప్పలు పాలకుల నిర్లక్ష్యానికి ప్రత్యక్ష నిదర్శనంగా నిలుస్తున్నాయి. ప్రతిరోజూ వందలాదిమంది ఈమార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. అయినా రోడ్డు పక్కన చెత్త కుప్పలు, కుళ్లిపోయిన వ్యర్థాలు, పారుతున్న మురికి కాలువలు ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయి. చెత్త దుర్వాసనతో పాటు వీధి కుక్కల బెడద అధికమై, పాదచారులు భయాందోళనలతో ప్రయాణం చేయాల్సిన దుస్థితి నెలకొంది. చిన్నపిల్లలు, వృద్ధులు బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. గ్రామాలలో పరిశుభ్రతే ఆరోగ్యానికి మూలాధారం అన్న విషయం పాలకులు మరిచి పోయినట్టుంది. వర్షాకాలం సమీపిస్తున్న వేళ, ఈ అపరిశుభ్ర పరిస్థితులు డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు వంటి అంటువ్యాధులకు ఆహ్వానం పలికినట్టుగా మారుతున్నాయి. అయినా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు కళ్లుమూసుకున్నారనే ఆరోపణలు గ్రామస్థుల నుంచి వెల్లువెత్తుతున్నాయి. అనేకసార్లు అధికారులకు, స్థానిక పాలకులకు మొరపెట్టుకున్నా స్పందన లేక పోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో వాగ్దానాలు, అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్లక్ష్యం ఇదేనా ప్రజాస్వామ్యం? ఇదేనా ప్రజలపై పాలకుల బాధ్యత? అంటూ గ్రామస్థులు నిలదీస్తున్నారు. గ్రామాల అభివృద్ధి అంటే శిలాఫలకాలు, బ్యానర్లు, ఫోటోలు కాదు.. ప్రజలు ఆరోగ్యంగా, సురక్షితంగా జీవించే వాతావరణాన్ని కల్పించడమే అసలైన అభివృద్ధి అని ప్రజలు గుర్తు చేస్తున్నారు. తక్షణమే ప్రత్యేక శుభ్రతా చర్యలు చేపట్టి, చెత్త తొలగింపు, కాలువల శుభ్రత పనులు ప్రారంభించాలని, ఇక్కడ ప్రజలు కోరుతున్నారు.

## స్వయం ఉపాధే సంక్షేమానికి బాట
**-నూతన ఆటోలను ప్రారంభించిన నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి**



నూతన ఆటోలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న దృశ్యం

**గుమ్మడిదల, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో స్వయం ఉపాధి ద్వారా యువత ఆర్థికంగా బలోపేతం కావాలని, ప్రతి కుటుంబం స్వావలంబన దిశగా సాగాలని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నూతన ఆటోలను ఆయన ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ప్రోత్సాహంతో స్వయం ఉపాధి అవకాశాలను వినియోగించుకుంటే నిరుద్యోగ సమస్యకు చెక్ పడుతుందని, యువత కష్టపడి పనిచేస్తే జీవనప్రమాణం మరింత మెరుగవుతుందని అన్నారు. ఆటోలను జీవనాధారంగా చేసుకుని కుటుంబాలను పోషిస్తున్న డ్రైవర్లకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. ఈతరహా కార్యక్రమాలు సమాజంలో ఆర్థిక అభివృద్ధికి బాటలు వేస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మంద భాస్కర్‌రెడ్డి, ఆకుల సత్యనారాయణ, పొన్నాల శ్రీనివాస్‌రెడ్డి, సూర్యనారాయణ, ఆటో యూనియన్ అధ్యక్షుడు శివ, దాసరి బుచ్చయ్య, నవీన్ యాదవ్, విగ్నేష్‌గౌడ్ తదితరులు పాల్గొని నూతన ఆటో యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు.

## తపస్ కృషితో మెదక్ పట్టణంలో పదోతరగతి మూల్యాంకన కేంద్రం

**పాపన్నపేట, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం అలుపెరుగని పోరాటంతోనే మెదక్ పట్టణంలో 10వ తరగతి మూల్యాంకన కేంద్రం ఏర్పాటు అయ్యిందని తపస్ జిల్లా కోశాధికారి మంగళ నర్సింలు వెల్లడించారు. ఆయన మండల కేంద్రమైన పాపన్నపేటలో విలేకరులతో మాట్లాడారు. సుమారు దశాబ్దకాలంగా తపస్ ఆధ్వర్యంలో మూల్యాంకనకేంద్రం కోసం పోరాటంచేయడం జరిగిందని దీంతో ఎట్టకేలకు మెదక్ పట్టణంలో మూల్యాంకన కేంద్రం ఏర్పాటయిందని ఆయన పేర్కొన్నారు. ఇందుకు కృషిచేసిన తపస్ రాష్ట్ర నాయకులకు మంగళ నర్సింలు ధన్యవాదాలు తెలిపారు.

## ముమ్మరంగా కొనసాగుతున్న ప్రహరీ పనులు



ప్రహరీ పనులు కొనసాగుతున్న దృశ్యం

**పాపన్నపేట, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
పాపన్నపేట మండల పరిధిలోని చిత్రియాల్ ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. సుమారు పది లక్షల వ్యాయంతో ఈ ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టినట్లు ఆ గ్రామ సర్పంచి బైరి సురేష్ వెల్లడించారు. విడతలవారీగా గ్రామాభివృద్ధి చేస్తామని సర్పంచి సురేష్ పేర్కొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కృషి
**-మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు**



హనుమంతరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
మెదక్ నియోజకవర్గంలో గ్రామాలను అభివృద్ధి చేయడానికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్‌పార్టీ రాష్ట్రనాయకులు మైనంపల్లి హనుమంతరావు అన్నారు. మండల పరిధి శాలిపేట గ్రామ సర్పంచి, ఉపసర్పంచి కిష్టయ్య, పాలకవర్గ సభ్యులతోపాటు 40మంది బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం భాగ్యనగరంలో మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా, వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

## ఎంపి కృషితోనే మూల్యాంకన కేంద్రం
**-బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాగి రాములు**

**రామాయంపేట, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
మెదక్ ఎంపి రఘునందన్‌రావు కృషి, పట్టుదలతోనే ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న పదవతరగతి మూల్యాంకన కేంద్రం మెదక్‌కు మంజూరు అయినట్లు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాగి రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపి రఘునందన్‌రావు పట్టుదలతో డివోకు సూచనలుచేస్తూ కలెక్టర్‌తో మాట్లాడి డిఎస్సీకి తాను స్వయంగా ప్రాతినిధ్యంచేస్తూ ఈవిషయమై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి మెదక్‌కు పదోతరగతి మూల్యాంకన కేంద్రాన్ని మంజూరుచేయించారని అన్నారు. ఆయనకు మెదక్‌జిల్లా పక్షాన అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. తపస్ మెదక్ జిల్లా కార్యవర్గం కూడా అనేకసార్లు ప్రాతినిధ్యం చేయడం, ఎంపికి విన్నవించడం జరిగిందన్నారు. తపస్ కార్యకర్తలకు ఎంపి మాట ఇచ్చి నిలబెట్టుకున్నట్టు పేర్కొన్నారు.

## విద్యార్థులు కెరియర్‌పై దృష్టి సారించాలి
**-కెరీర్ గైడెన్స్ అధికారి శ్రీధర్**



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

**పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని కెరీర్‌పై స్పష్టమైన ప్రణాళికతో ముందుకు సాగాలని కెరీర్ గైడెన్స్ అధికారి శ్రీధర్, ఎక్స్పర్ట్ పర్సన్ సంతోష్‌లు అన్నారు. బుధవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతోపాటు కెరియర్‌ను ఏవిధంగా తీర్చిదిద్దుకోవాలో వారు వివరించారు. కేవలం మార్కులు సాధించడమే లక్ష్యంగా కాకుండా జీవితంలో స్థిరపడేందుకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని తెలిపారు. నూతన కోర్సులు, ఆధునిక సాంకేతిక విద్య, వృత్తి అవకాశాలు వంటి వాటిపై అవగాహన పెంచుకొని మెరుగైన భవిష్యత్తును నిర్మించుకోవచ్చు అని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశం, ఉపాధ్యాయులు సిద్ది రాములు, గంగాధర్, శోభారాణి, రాధిక, అశ్వని, రమ్య, భారతి, నాగవేణి తదితరులు పాల్గొన్నారు.

# కొల్లూరు ఎగ్జిట్ 2 పనులు త్వరలో పూర్తి
**-మెదక్ ఎంపి రఘునందన్‌రావు**
**సర్వీస్ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన ఎంపి**



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపి రఘునందన్‌రావు

**రామచంద్రాపురం, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఓఆర్ఆర్ ఎగ్జిట్ సర్వీస్ రోడ్ రైల్వే ఓవర్ బ్రిడ్జ పనులు అసంపూర్తిగా వదిలివేయటానికి పదేళ్ల అధికారంలో ఉన్న అసమర్థతే కారణమని మెదక్ ఎంపి మాధవనేని రఘునందన్‌రావు విమర్శించారు. బుధవారం సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం కొల్లూరు ఓఆర్ఆర్ ఎగ్జిట్ నెంబర్ 2 వద్ద జరుగుతున్న సర్వీస్ రోడ్డు నిర్మాణ పనులను ఎంపి రఘునందన్‌రావు పర్యవేక్షించారు. ఎగ్జిట్ 2 వద్ద పదేళ్లుగా పెండింగ్ లో ఉన్న పనులను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపి రఘునందన్ రావు మాట్లాడుతూ.. మహానగరానికి మణిహారంగా నిర్మించిన అవుటర్ రింగ్ రోడ్డులో ఎగ్జిట్ 2 ఒక సమస్యగా మారిందని అన్నారు. అప్రోచ్ రోడ్డుకు కనెక్టివిటీ లేకపోవటం, రైల్వే లైన్ సమస్యతో ఇక్కడ సర్వీస్ రోడ్డు అసంపూర్తిగా వదిలివేయటం జరిగిందన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం కనీసం ప్రజా సమస్యను పట్టించుకున్న దాఖలాలు లేవని ఆరోపించారు. తాను ఎంపిగా గెలిచిన తరువాత అన్ని శాఖల సమన్వయంతో 25 కోట్లు నిధులను మంజూరు చేయించటం జరిగిందని గుర్తుచేశారు. అదేవిధంగా రెండున్నర ఎకరాల భూమిని కేటాయించడం జరిగిందని తెలిపారు. డిసెంబర్ నెలాఖరు కల్లా పనులు పూర్తి చేసి ఎగ్జిట్ 2 సర్వీస్ రోడ్డును ప్రజాబాహుళ్యంలోనికి తీసుకువస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సర్వీస్ రోడ్ పూర్తయిన తర్వాత గేటెడ్ కమ్యూనిటీ తెల్లాపూర్, కొల్లూరు, ఉస్మాన్ నగర్, నాగులపల్లి, వెలిమెల గ్రామాల ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు దూరమవుతాయని ఎంపి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు రాంబాబుగౌడ్, మాజీ కౌన్సిలర్ శంషాబాద్ రాజు, బిజెపి సీనియర్ నాయకులు నరసింహారెడ్డి, రాజేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, ప్రవీణ్, రవి, నరసింహ, శంకర్‌చారి, సత్యానారాయణ, రాజురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుని ఎన్నిక



రవిగౌడ్‌ను సన్మానిస్తున్న రేషన్ డీలర్లు తదితరులు

**నర్సాపూర్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
నర్సాపూర్ మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షునిగా రవిగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షులు ఆనంద్‌కుమార్ తెలిపారు. బుధవారం మల్లన్నగుడి సమీపంలో మండల డీలర్ల సమావేశం నిర్వహించి, నూతనకమిటీని ఎన్నుకోవడం జరిగింది, ప్రధాన కార్యదర్శిగా కె.నర్సింలు, కోశాధికారిగా సుధాకర్, ఉపాధ్యక్షులుగా బిక్షపతి, కార్యవర్గ సభ్యులుగా రమేష్‌గౌడ్, శంకరయ్య, రమేష్ గుప్తా, అశోక్ జనార్దన్‌గౌడ్‌లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మండల రేషన్ డీలర్లు జైపాల్, ఫయుముద్దీన్, గోపాల్‌గౌడ్, దశరథ, రాజు, విక్రమ్, శ్రీశైలం, రాజుగౌడ్, కుమార్, ప్రభాకర్, చందర్‌నాయక్, శ్రీనివాస్‌గౌడ్‌తోపాటు ఇతరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన
**-తూప్రాన్ సిఐ రంగకృష్ణ**




విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న తూప్రాన్ సిఐ రంగకృష్ణ

**వెల్దుర్తి, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
మండలంలోని కుక్కునూరు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో బుధవారం విద్యార్థులకు తూప్రాన్ సిఐ రంగాకృష్ణ, స్థానిక ఎస్ఐ రాజు కార్యక్రమంలో పాల్గొని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు సైబర్‌నేరాల గురించి రోడ్డుభద్రత నియమాల గురించి వివరించారు. సైబర్‌నేరాల బారినపడకుండా ఎలా ఉండాలో, రోడ్డు ప్రమాదాలను ఎలా నివారించుకోవాలి, వాటిని పాటించే విధంగా చర్యలు తీసుకోవాలనే విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు



పరీక్షలకు హాజరైన విద్యార్థులు

**వెల్దుర్తి, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన సరస్వతి మెమోరియల్ ప్రభుత్వ కళాశాలలో బుధవారం మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి సంవత్సరంలో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు మొత్తం 57మంది ఉండగా పరీక్షలకు 56మంది హాజరయ్యారు. ఒక విద్యార్థి గైర్హాజరయ్యారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ జరగకుండా విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయడం జరిగిందని కళాశాల సూపరిండెంట్ శ్రీనివాసులు తెలిపారు.

## శీలంపల్లి జిపి భవనానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న సర్పంచి రాజేందర్‌రెడ్డి

**చిలిపిచెడ్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
చిలిపిచెడ్ మండల పరిధిలోని శీలంపల్లి గ్రామపంచాయతీ భవనం మహిళాసంఘం భవనాలకు గ్రామసర్పంచి రాజేందర్‌రెడ్డి పిఆర్ఏఈ మారుతితో కలిసి బుధవారం భూమిపూజ చేశారు. గ్రామ పంచాయతీ భవనానికి ఈజిఎస్ నిధులు రూ.20లక్షలు, మహిళాసంఘం భవనానికి రూ.10లక్షలు మంజూరయ్యాయి అన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచి కిష్టారెడ్డి, వార్డుసభ్యులు రామ్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, భగవంతు రెడ్డి, గ్రామ కార్యదర్శి అఖిల్ గ్రామస్థులు పాల్గొన్నారు.

## నూతన సాంకేతిక పరిజ్ఞానంతో అధిక దిగుబడులు
**-ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ రంజిత**

**పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
నూతన సాంకేతికపరిజ్ఞానం వినియోగంద్వారా పంటలో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ రంజిత అన్నారు. బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఆత్మ సౌజన్యంతో రైతువేదికలో ఏర్పాటుచేసిన రెండవరోజు రైతుశిక్షణ శిబిరంలో పాల్గొని ఆమె మాట్లాడారు. ఈసందర్భంగా వ్యవసాయ అధికారి నాగం కృష్ణ వర్మ ఎరువు తయారీ, వేపకషాయం తయారీ, రైతుల సంఘటితంపై రైతులకు వివరించారు. శిక్షణకు హాజరైన రైతులకు ట్రైనింగ్ సర్టిఫికెట్లను అధికారులు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు వినీత్, అఖిల్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధే ప్రధాన లక్ష్యం



మహిళాసమాఖ్య భవనానికి భూమిపూజచేస్తున్న సర్పంచి చంద్రశేఖర్

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**
చిన్నశంకరంపేట పట్టణంలో రూ.10లక్షల వ్యయంతో నిర్మించనున్న గ్రామసమాఖ్య మహిళాభవనానికి మంగళవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు పోగుల రాజు, ఆకాష్‌గౌడ్, జాల సునీల్, జాకీర్, మహిళాసంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.